సాక్షి ఒడిశా

శనివారం । 22 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,56,994లు, బంగారం 50 మిల్లీగ్రాములు, వెండి 39.35 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వైద్యానికి పెద్దపీట

- మంత్రిమండలి సమావేశంలో 17 ప్రతిపాదనలకు ఆమోదం

- IIలో



అన్నాచెల్లెలు.. బంగారాలు

- IIలో

న్యూస్‌రీల్

104కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, కారుతో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: సబ్ డివిజన్ పరిధిలో కారులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే అధికారులను గమనించిన దుండగులు వాహనాన్ని వదిలి, పరారయ్యారని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్యోధన బిశ్వాల్ తెలిపారు. ముందస్తుగా అందిన విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు జయపురం ఎక్సైజ్ సిబ్బంది గురువారం అర్ధరాత్రి సమయంలో కలియగాం–పూజారిపుట్ కూడలి వద్ద గస్తీ చేపట్టారు. అటుగా వస్తున్న కారుని ఆపేందుకు ప్రయత్నించగా, ముందే అప్రమత్తమైన డ్రైవర్, దుండగులు వాహనాన్ని వదిలి సమీపంలోని అడవిలోకి పరుగులు తీశారు. వారిని పట్టుకొనేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కారుని పరిశీలించగా, గంజాయి బైటపడింది. మెజిస్ట్రేట్ సమక్షంలో దీనిని తూకం వేయించగా 104కిలోలు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కండి, ఏఎస్‌ఐ ఎం.లక్ష్మణరావు, ప్రదీప్ దొళాయి, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి కేంద్రంలో మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు బలగ కిరణ్(25)కు 20ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రదీప్‌కుమార్ సామల్ తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2021 సెప్టెంబర్‌లో కాశీనగర్‌లో గణపతి ఉత్సవాల నిమజ్జనం జరుగుతున్న సమయంలో నిందితుడు మైనర్‌పై అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు కాశీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ సుశాంతకుమార్ సాహు దీనిపై కేసు నమోదు చేసి, కిరణ్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. దీనిపై సాక్ష్యాధారాలు పరిశీలించిన మేరకు అదనపు న్యాయమూర్తి శుక్రవారం తుది తీర్పు వెలువరించారు. నిందితునికి 20ఏళ్లు జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పునిచ్చారు. కేసును ప్రభుత్వ న్యాయవాదులు శరత్‌చంద్ర ప్రధాన్, ఆర్.జనార్దనరావు పర్యవేక్షించగా, నిందితుడి తరఫున ఎల్‌కే అధికారి వాదనలు వినిపించారు.

కుప్పకూలిన పాఠశాల గోడ



దామొదర్‌బెడలో గోడ కూలిన దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమమ్ముడి పంచాయతీ దామోదర్‌బేడ ప్రాథమిక పాఠశాల తరగతి గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే గురువారం రాత్రి ఈ ఘటన జరగడం, ఆ సమయానికి విద్యార్థులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 16 గ్రామాల పరిధిలో 20ఇళ్లు నేలమట్టం అయ్యాయని అధికారిక వర్గాల సమాచారం. పాఠశాల గోడ కూలిన నేపథ్యంలో తరగతులకు 2రోజులు సెలవు ప్రకటించారు. స్పందించిన జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. నూతన భవనం నిర్మించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని, ఈలోగా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఏటీఎం సేవలు



ఏటీఎం వద్ద సిబ్బందితో కలెక్టర్, జెడ్పీ చైర్మన్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం వద్ద ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎం యంత్రాన్ని కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఐసీఐసీఐ పర్లాకిమిడి బ్రాంచి మేనేజర్ లక్ష్మీనారాయణ్ నాయక్, డిప్యూటీ బీఎం కీర్తి స్వాయిని, సిబ్బంది పాల్గొన్నారు.

నవీన పథం..



- దీర్ఘకాలం సీఎంగా కొనసాగిన జాబితాలో నవీన్ పట్నాయక్ రికార్డు
- నేటితో 23 ఏళ్ల 138రోజులు పూర్తి చేసుకోనున్న పాలన
- జ్యోతి బసు నిరవధిక రికార్డు ఇక మాయం
- రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, పరివర్తన దిశగా అడుగులు

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దేశంలో దీర్ఘకాల ముఖ్యమంత్రిగా కొనసాగిన ప్రముఖుల జాబితాలో చేరనున్నారు. జాతీయ స్థాయిలో రెండో దీర్ఘకాలిక సీఎంగా సరికొత్త రికార్డు నెలకొల్పనున్నారు. నవీన్ ప్రత్యక్ష రాజకీయ జీవితంలో ఇదో సుస్థిర మైలురాయిగా నిలుస్తుందని బిజూ జనతాదళ్ శిబిరంలో ఆనందం వెల్లివిరుస్తోంది. పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి దివంగత జ్యోతి బసు తరువాత దీర్ఘకాలం ఈ పదవిలో కొనసాగిన రికార్డు ఆక్రయించనున్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఒడిశా పరివర్తన ప్రధాన కార్యాచరణ ఆయనకు ఈ రికార్డు సాధకులుగా చరిత్రలో నిలుపుతుంది. జ్యోతి బసు సమగ్రంగా 23 సంవత్సరాల 138 రోజులు నిరవధికంగా పదవిలో కొనసాగారు. ఆయన తర్వాత సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్‌కుమార్ చామ్లింగ్ 24 ఏళ్ల 166 రోజులు ముఖ్యమంత్రిగా కొనసాగిన రికార్డు ఉంది. ఈ నేపథ్యంలో దేశంలోనే అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రెండో వ్యక్తిగా నవీన్ పట్నాయక్ స్థానం సాధించడం విశేషం. ఆయన వరుసగా 5సార్లు సీఎంగా పగ్గాలు చేపట్టారు. ఈనెల 22తో ముఖ్యమంత్రి పాలన సమగ్రంగా 23 సంవత్సరాల 138 రోజులు పూర్తి చేసుకుంటుంది. గతంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతి బసు ఇదే కాల పరిమితిలో గతంలో దీర్ఘకాలిక ముఖ్యమంత్రిగా రికార్డు నెలకొలిపారు. తాజా రికార్డుతో నవీన్ ఆయన సరసన చోటు దిక్కించుకుకోవడం విశేషం. జాతీయ స్థాయిలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా కొనసాగిన వ్యక్తిగా ఎదిగేందుకు స్వల్ప దూరంలో ఉన్నారు. 2000, 2004, 2009, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో నవీన్ పట్నాయక్ రాష్ట్ర శాసనసభకు వరుసగా ఎన్నికయ్యారు. ఆయన అకుంఠిత కార్యదక్షత ముఖ్యమంత్రి హోదాని సొంతం చేసింది.

ఎత్తుకు ప్రత్యర్థులు చిత్తు..

మహిళ, రైతు సాధికారిత ఇతరేతర రంగాల్లో సంస్కరణలు రాష్ట్రానికి సరికొత్త రూపురేఖలు అద్దాయి. సేవాభావం, సామాజిక శ్రేయస్సు పట్ల అంకితభావం ప్రజా ప్రాతినిధ్యానికి ప్రామాణికంగా రుజువు చేసిన దాఖలాలు కోకొల్లలు. గంజాం జిల్లా అసికా పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి మహిళా స్వయం సహాయక సంఘం సాధికార మహిళ ప్రమీల బిసొయిని ఎంపీగా గెలిపించుకున్న తీరు.. బిజూ జనతాదళ్ అధ్యక్షుడుగా నవీన్ పట్నాయక్ సాధించిన అపురూప విజయం. ప్రత్యర్థుల్లో ధీటైన సభ్యులను సమయోచితంగా ఆకట్టుకుని, పార్టీని బలోపేతం చేస్తూ ఎప్పటికప్పుడు ప్రతిపక్షాలను ఖంగు తినిపించడంలో ఆయన ధీరత్వానికి ప్రతీక. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల కంచుకోటలుగా నిలిచిన పలు నియోజక వర్గాలను బీజేడీ ఖాతాలో చేర్చుకున్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ ఒడిశా సమగ్రంగా కైవసం చేసుకునే వ్యూహంతో పావులు కదుపుతున్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..



గంజాం జిల్లా హింజిలికాట్ నవీనపట్నాయక్‌కు కలిసి వచ్చిన నియోజకవర్గంగా మిగిలింది. దీనితో పాటు పాలనలో విపత్కర పరిస్థితులను అవలీలగా అధిగమించి, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థల విశేష గుర్తింపుతో ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా నిలిచారు. రాష్ట్రంలో ఆకలి చావులకు తెరదించిన దిశలో ఆయన కృషి అనన్యమని చెప్పవచ్చు. ప్రజలకు పారదర్శక పాలన ఇంటి ముంగిటకు చేర్చడంలో సాధించిన విజయం అత్యద్భుతం. ప్రభుత్వ సేవలు ప్రజలకు నిర్ధారిత కాల పరిమితిలో కల్పించడమే ధ్యేయంగా చేపట్టిన 5టీ కార్యాచరణ రాష్ట్ర పరివర్తనలో సరికొత్త మలుపు తిప్పింది. అవినీతి రహిత పాలన కార్యాచరణ సులభతరం చేసిన సాటిలేని ముఖ్యమంత్రిగా పేరొందారు. సమాచారం, రవాణా, బాహ్య ప్రపంచంతో రాష్ట్రాన్ని అనుసంధానం చేయడం.. జాతీయ, అంతర్జాతీయ వర్తక వ్యాపారాలు, పారిశ్రామిక విస్తరణతో రాష్ట్ర పురోగతిలో వేగం పుంజుకుంది. విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలు సకాలంలో అక్కరకు వచ్చే రీతిలో ప్రవేశ పెట్టిన పథకాలు, కార్యక్రమాలు జాతీయ స్థాయిలో మార్గదర్శకంగా నిలిచాయి.

ఆకట్టుకున్న విన్యాసాలు



విపత్కర పరిస్థితుల్లో దాడులు చేపట్టే విధానంపై జవాన్ల ప్రదర్శన



గగనతలంలో క్షిపణి ప్రయోగిస్తున్న దృశ్యం



లక్ష్యాన్ని ఛేదిస్తున్న మిస్సైల్

బరంపురం: గోపాల్‌పూర్ సముద్ర తీరంలో గోళాబంద ఆర్మీ క్యాంప్ పర్యవేక్షణలో భారత సైన్యం శుక్రవారం క్షిపణి ప్రయోగాలు చేపట్టింది. గోళాబంద ఎయిర్ డిఫెన్స్ గైడెడ్ మిస్సైల్(ఏడీజీఎం), ఆర్మీ రైజింగ్ ఫైరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యుద్ధ విన్యాసాలు, క్షిపణి పరీక్షలు, మిస్సైల్ ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. గగనతలంలో శత్రువుల నుంచి ఎదురయ్యే దాడులు, లక్ష్యాలను ఛేదించే విధంగా చేపట్టిన రాకెట్ పరీక్షలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గోపాల్‌పూర్ రెజిమెంట్ ఉన్నతాధికారి లెఫ్టినెంట్ జనరల్ ఏసీ సింగ్, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

కొఠియాలో 'జగనన్న సురక్ష'



లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ అధికారులు



జగనన్న సురక్ష కార్డులతో కొఠియా ప్రజలు

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద సరిహద్దు ప్రాంతం కొఠియాలో గిరిజనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం కార్డులు పంపిణీ శుక్రవారం పంపిణీ చేశారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా పంచాయతీ నేరేడివలస గ్రామంలో ఆ రాష్ట్రానికి చెందిన అధికారులు ఈ కార్యక్రమా న్ని నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం నుంచి వచ్చిన అధికారులు 39 మంది గిరిజనులకు ఈ కార్డులు అందజేశారు. వివి ధ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు పొందలేని అర్హులను గుర్తించి, లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, బీ సు గెమల్, చోడిపల్లి బీసు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ఎంపీలతో కొరాపుట్ ఎంపీలు భేటీ



కొరాపుట్ ఎంపీ సప్తగిరి దంపతులతో బస్తర్ ఎంపీ దీపక్ బైజ్



నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌తో బస్తర్ ఎంపీ, మహాసముంద్ ఎంపీ చునీలాల్

కొరాపుట్: సరిహద్దు రాష్ట్రాల ఎంపీలతో ఉమ్మడి కొరాపుట్ జిల్లాల ఎంపీలు శుక్రవారం స్నేహ పూర్వకంగా భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో ఆ పార్టీ రాష్ట్ర పరిశీలకునిగా ఉన్నారు. కొరాపుట్ పార్లమెంటరీ స్థానానికి సరిహద్దుగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పార్లమెంటరీ నియోజకవర్గం ఉంది. అక్కడ కాంగ్రెస్‌కు చెందిన దీపక్ బైజ్ ఎంపీ కొనసాగుతున్నారు. దీపక్‌ను ఏఐసీసీ ఆ రాష్ట్ర పీసీసీ నూతన అధ్యక్షుడిగా అధిష్టానం నియమించింది. దీంతో ఢిల్లీలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క దంపతులను ఆయన నివాసంలో శుక్రవారం కలుసుకొని, కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బీజేడీకి చెందిన రమేష్‌చంద్ర మాఝి తన పార్లమెంటరీ స్థానికి సరిహద్దులో ఉన్న ఛత్తీస్‌గఢ్ లోని మహాసముంద్ ఎంపీ చునీలాల్ సాహు, బస్తర్ ఎంపీ దీపక్ బైజ్‌ను స్నేహ పూర్వకంగా కలుసుకున్నారు.

ఆగస్టు 9న 'మోదీ హటావో'



మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి బిజయ జెనా

- దేశవ్యాప్త ఆందోళనకు కార్మిక సంఘాల పిలుపు



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

జయపురం: స్వాతంత్ర్య పోరాటంలో దేశ విముక్తి కోసం మహాత్మాగాంధీ ఆంగ్లేయులను భారత్ ఛోడో(క్విట్ ఇండియా) అని పిలుపునిచ్చారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బిజయ జెనా గుర్తుచేశారు. ప్రస్తుతం నెలకొన్న విషమ స్థితిలో బీజేపీ ప్రభుత్వం బారి నుంచి దేశాన్ని కాపాడేందుకు ఆగస్టు 9న ఆందోళనకు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆ రోజును క్రాంతి దినోత్సవం నిర్వహించేందుకు ప్రజాసంఘాలు నిర్ణయించాయన్నారు. ఈ మేరకు జయపురం టౌన్ హాలులో ఏఐటీయూసీ, టీయూసీసీ, ఏఐయూటీయూసీ, జయపురం సిటీ కో–ఆర్డినేషన్ కమిటీలు శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. 2014లో అధికారం చేపట్టిన ప్రధాని మోదీ అచ్చే దిన్ వస్తుందని చెప్పారని, అయితే ఆయన పాలనలో శ్రామికులు, సామాన్యులకు దుర్దశ వచ్చిందని ఆక్షేపించారు. దేశంలో నిరుద్యోగ సమస్య, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. దీనిని ఖండిస్తూ మోదీ హటావో నినాదంతో చేపట్టనున్న క్రాంతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు సుభాష్ భట్టాచార్య, సూర్యనారాయణ బిశాయి, శంభు మహంతి, నళినీ రథ్, సంతోష్‌కుమార్ పాత్రొ, కన్హు బిశ్వాల్, ఉత్తమ మల్లిక్, జుధిష్టర్ రౌళొ పాల్గొని, ప్రసంగించారు.

సెల్‌పాయింట్‌లో చోరీ

- 40సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన దుండగులు



చోరీకి గురైన ఎస్‌వీ సెల్‌పాయింట్



ఒకేవైపు తిరిగి ఉన్న సీసీ కెమెరాలు

రాయగడ: పట్టణంలోని రైతుల కాలనీ రెండో లైన్‌లో ఉన్న ఎస్‌వీ సెల్‌పాయింట్‌లో చోరీ చోటు చేసుకుంది. గుర్తు తెలియని ముగ్గురు దుండగులు దుకాణం షట్టర్లను విరగొట్టి, లోపల ఉన్న 40 సెల్ ఫోన్లను దోచుకుపోయారు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని దుకాణం యజమాని సిల్లా సంతోష్‌కుమార్ తెలిపారు. ఎప్పటిలాగే గురువారం రాత్రి 9గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోగా, శుక్రవారం ఉదయం తాళాలు విరగ్గొట్టి ఉండటంతో పక్క దుకాణం యజమాని సంతోష్‌కు సమాచారం అందించారు. వెళ్లి చూడగా దుకాణంలోని సెల్‌ఫోన్లు అపహరణకు గురవ్వడంతో పాటు, ఫర్నీచర్ ధ్వంసమై ఉన్నాయి. దీనిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతానికి సమీపంలోని ఓ ఇంటి ముందు ఉన్న సీసీ పుటేజ్‌ను పరిశీలించగా, ముగ్గురు వ్యక్తులు ఈ దొంగతనంలో పాల్గొన్నట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా రైతులకాలనీ మెయిన్ రోడ్డు వద్ద మున్సిపల్ యంత్రాంగం ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన 2కెమెరాలను దుండగులు తెలివిగా ఒకే వైపునకు తిప్పి, ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. అయితే దుండగులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖామంత్రి అతాను సవ్యసాచి



సర్క్యూట్ హౌస్‌లో మంత్రి సవ్యసాచికి జిల్లా పరిస్థితులను వివరిస్తున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: 'అమో ఒడిశా–నవీన ఒడిశా' పథకంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం ప్రతి పంచాయతీకి రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయనుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖామంత్రి అతాను సవ్యసాచి తెలిపారు. వీటిని సద్వినియోగించుకొని, మౌలిక సదుపాయాల కల్పన, ప్రార్థనాలయాల అభివృద్ధి, చెరువుల నిర్మాణాలకు వెచ్చించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో బీజేడీ జిల్లా, మండల స్థాయి నాయకులు, సమితి అధ్యక్షులు, సర్పంచ్‌లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ఉప పరిశీలకులు పృథ్వీరాజ్ భువనేశ్వర్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇటీవల రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ జిల్లాలో పర్యటించిన సందర్భంలో విడుదుల చేసిన నిధుల వినియోగంపై అనుమతించాలని కోరారు. అలాగే గజపతి జిల్లాలోని 7సమితి కేంద్రాల పరిధి 149 పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్లశాయమ్మ, గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్, ఎన్‌ఏసీ చైర్‌పర్సన్ మరియం రైతో తదితరులు తమ పంచాయతీల్లో పలు సమస్యలు, కావాల్సిన నిధుల మంజూరుకు జాబితా లను అందజేశారు. సమావేశంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు జోగబంధు దాస్, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి, బసంత్ దాస్, మారుత్ పాలో తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైసెన్స్ లేని దుకాణాలకు జరిమానా



రెడీమేడ్ దుకాణాన్ని సీజ్ చేయిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: పట్టణంలోని ప్రధాన మార్కెట్, కోమటి వీధి, టైలర్ స్ట్రీట్, బంగారం మార్కెట్‌లో మున్సిపల్ అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లపై తనిఖీలు చేపట్టారు. ఈ ఏడాది మార్చిలో మున్సిపల్ అధికారులు స్థానిక టౌను హాలులో చిరువ్యాపారులు, దుకాణదారులు, హోల్‌సేల్ వర్తకులకు ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేసి, గడువు విధించారు. ఈ గడువు ముగిసిన నేపథ్యంలో రెన్యువల్ చేసుకోని దుకాణాల్లో పోలీసుల సాయంతో డిప్యూటీ కలెక్టర్, మున్సిపల్ సిబ్బంది తనిఖీలు చేశారు. పలువురికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధించారు. టైలర్ వీధిలోని ఓ రెడీమేడ్ దుకాణ యజమాని రెండేళ్లుగా ట్రేడ్ లైసెన్స్ పొందక పోవడంతో దుకాణాన్ని అధికారులు సీజ్ చేశారు.

వర్షపాతం సాధారణం: ఎస్ఆర్‌సీ



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఆర్‌సీ

భువనేశ్వర్: రాష్ట్రంలో ఈనెల 27వరకు వర్షాలు కురిసేందుకు అనుకూల వాతావరణం నెలకొని ఉంది. అల్పపీడనం కారణంగా పలుచోట్ల వర్షాలు కురవనున్నాయి. 1, 2 రోజుల పాటు పశ్చిమ ఒడిశాలో, తీర ప్రాంతాల్లో వర్షాల తాకిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో సంబంధిత జిల్లా అధికారులను హెచ్చరించినట్లు ప్రత్యేక సహాయ కమిషనర్ ప్రదీప్ జెనా శుక్రవారం తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జలవనరుల శాఖ అధికారులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని ఉత్తర్వులు వెలువరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, అనుబంధ యంత్రాంగం అనుక్షణం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా అసాధారణ పరిస్థితి తలెత్తలేదని, 7, 8 జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల్లో అవసరానికి అనుగుణంగా వర్షపాతం నమోదైందని ప్రకటించారు. వ్యవసాయానికి ఈ వర్షాలు ఉపకరించడంతో పాటు రానున్న 3, 4 రోజులు రైతులకు మరింత అనుకూలంగా ఉంటుందని వివరించారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీప కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం తాత్కాలిక యాగశాలలో విశేష హోమం చేశారు. తరువాత స్వామి వెండి మంటపం వద్ద నిత్య కల్యాణ వేడుకను కనుల పండువగా జరిపించారు. సాయంత్రం 6గంటలకు ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి సహస్ర దీపారాధన మంటపంపై ఉన్న ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేశాక సహస్ర దీపాలను వెలిగించి స్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు.

జిల్లా జట్టుకు నలుగురు క్రీడాకారిణుల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రికెట్ క్రీడాకారిణులు

శృంగవరపుకోట: పట్టణంలోని మహి క్రికెట్ అకాడమీకి చెందిన నలుగురు క్రీడాకారిణులు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నేతృత్వంలో నిర్వహించనున్న మహిళల వన్‌డే పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు అండర్-19 విభాగానికి సంబంధించి గండ్రెడ్డి తులసి, అనపర్తి హరిణి, సీనియర్స్ విభాగంలో చిప్పాడ లిఖిత, జాన పవిత్ర, జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహిస్తారు. అండర్-19 పోటీలు జూలై 21 నుంచి 23వ తేదీ వరకూ, సీనియర్స్ విభాగం పోటీలు జూలై 25 నుంచి 27వరకూ విజ్జీ స్టేడియంలో జరుగుతాయని కోచ్ బంక శ్రీను తెలిపారు.

జూలై 28కి లక్ష్మీపేట కేసు వాయిదా

వంగర: మండల పరిధి లక్ష్మీపేట కేసు విచారణ జూలై 28వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రత్యేక న్యాయస్థానంలో జడ్జి ఫణికుమార్ కేసు విచారణ చేపట్టి వాయిదా వేశారు. ఈ కేసులో 80 మంది నిందితులకు గాను గతంలో 12 మంది మరణించగా 67 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. సీఐ ఉపేంద్రరావు, ఎస్సై జనార్దనరావు విచారణ సందర్భంగా పాల్గొన్నారు.

వైద్యానికి పెద్దపీట

- మంత్రిమండలి సమావేశంలో 17 ప్రతిపాదనలకు ఆమోదం
- క్యాన్సర్ రోగులకు అధునాత వైద్యానికి రూ.1001 కోట్లు కేటాయింపు



భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఇందులో 17 ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మిషన్‌శక్తి, వ్యవసాయం, ఆరోగ్యం, సామూహిక విద్య, జల వనరులు, సమాచారం, సాంకేతిక విద్య, పరిపాలన విభాగాల ప్రతిపాదనలు ఆమోదం పొందడం విశేషం. వీటిలో మిషన్ శక్తి స్కూటర్ యోజన ప్రాధాన్యమైనదిగా పేర్కొన్నారు. కేంద్రాపడా జిల్లా మర్షాఘాయి-జంబూద్ రహదారి విస్తరణ, పటిష్టత కోసం రూ. 103.45 కోట్ల విలువైన బిడ్‌కు ఆమోదించారు. మర్షాఘాయి నుంచి జంబూద్ వరకు 2లైన్ల క్యారేజ్ వేగా మలుచుతారు. ఈ ప్రాజెక్టు 21 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని కాల పరిమితి నిర్ధారించింది. 2023 -24 కోసం రాష్ట్ర సెక్టార్ అభివృద్ధి కార్యక్రమం కింద ప్రాజెక్ట్ మెరుగైన కనెక్టివిటీని నిర్ధారించడంతో పాటు ట్రాఫిక్‌ను నియంత్రిస్తుందన్నారు. అలాగే ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సమగ్ర క్యాన్సర్ సంరక్షణకు..

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర క్యాన్సర్ సేవలను విస్తరించేందుకు రూ.1001.14 కోట్ల బడ్జెట్‌ను మంత్రిమండలి ఆమోదించింది. బర్‌గడ్ జిల్లా ప్రధాన ఆస్పత్రి, విమ్‌సార్ బుర్లా, కొరాపుట్ ఎస్ఎల్ఎస్ వైద్య బోధనాస్పత్రి, బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రి, కలహండి జిల్లా భవానీపట్న సహీద్ రెండో మాఝీ మెడికల్ కళాశాల, ఆస్పత్రి, పీఆర్ఎం మెడికల్ కళాశాల ఆస్పత్రి-బరిపద, బాలాసోర్ ఎఫ్ఎం మెడికల్ కళాశాల ఆస్పత్రి, ధరణీధర మెడికల్ కళాశాల ఆస్పత్రి-కెంజొహర్, తాల్చేరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి, బొలంగిర్ బీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రి, ధరణిధర్ మెడికల్ కళాశాల ఆస్పత్రి-కియోంజర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆస్పత్రి-తాల్చేర్. క్యాపిటల్ ఆస్పత్రి-భువనేశ్వర్ ఆస్పత్రుల్లో రానున్న 2 ఏళ్లలో కేన్సర్ సంరక్షణ వసతులు పూర్తి చేయనున్నారు. క్యాన్సర్ రోగులు ఇప్పటివరకు అధునాతన క్యాన్సర్ సంరక్షణ కోసం రాష్ట్రం నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యలకు కళ్లెం వేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్యాకేజీ కింద రేడియోథెరపీ, బ్రాకీథెరపీ, హిస్టోపాథాలజీ, ఆంకో-సర్జరీ, కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ సేవలను అందుబాటులోకి తీసుకు వస్తారు. ఈ విభాగాల్లో 50నుంచి 100 పడకలతో పాటు ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, కీమోథెరపీ, రేడియోథెరపీ, పాలియేటివ్ కేర్ యూనిట్‌లతో అవసరమైనప్పుడు భవిష్యత్‌లో విస్తరించే సదుపాయంతో పనులు చేపడతారు. బాధితు నిరంతరాయ సేవలను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్ట్, టెక్నికల్ స్టాఫ్‌ల పోస్టులు రెగ్యులర్ కేడర్‌గా సృష్టించేందుకు కేబినెట్ ఆమోదించింది.



కేబినెట్ తీర్మానాలను వివరిస్తున్న చీఫ్ సెక్రటరీతో మంత్రులు

ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం



శిక్షణలో సూచనలందిస్తున్న అధికారులు

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉత్కర్ష కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు 3రోజుల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలిరోజు బొయిపరిగుడ, కుంద్రా, సెమిలిగుడ, కొరాపుట్, లమతాపుట్ సమితుల నుంచి 122మంది ఉపాధ్యాయులు హాజరు కాగా.. భాష, విజ్ఞానం(సైన్స్) అంశాలపై శిక్షణ అందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామచంద్ర నాయక్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో జిల్లా అదనపు విద్యాధికారి జగన్నాథ్ పాత్రొ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ మెహరా, సీనియర్ ఉపాధ్యాయులు యజ్ఞేశ్వర పండా, జగన్నాథ సాహు, సిద్ధార్థ శంకర మహాపాత్రొ పాల్గొని, పలు సూచనలందించారు. 2, 3 రోజుల్లో మిగతా సమితులకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా ఉపాధ్యాయ కో-ఆర్డినేటర్ చంద్రకళా భగర్తి, జిల్లా విజ్ఞాన పర్యవేక్షకులు అనంత దళపతి పర్యవేక్షించారు.

అన్నాచెల్లెలు.. బంగారాలు



ప్రథమ స్థానంలో నేహా పట్నాయక్



బంగారు పతకంతో లోహిత్

రాయగడ: ఈనెల 19,20 తేదీల్లో ఉత్తరప్రదేశ్ లోని ఆగ్రా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 4వ జాతీయ క్రాస్‌బౌ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాయగడకు చెందిన అన్నా, చెల్లెలకు బంగారు పథకాలు లభించాయి. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, అస్సాం, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యానా, కేరళ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మహిళా విభాగం అండర్-23 కేటగిరిలో నేహా పట్నాయక్ 450 పాయింట్లకు గాను 390 పాయింట్లు సాధించుకొని, బంగారు పతకం కైవసం చేసుకుంది. అండర్-23 పురుషుల మధ్య జరిగిన పోటీల్లో లోహిత్ పట్నాయక్ 355 పాయింట్లు సాధించి, గోల్డ్ మెడల్‌ను దిక్కించుకున్నాడు. రాష్ట్రం తరుపున ఇద్దరు మాత్రమే పోటీల్లో పాల్గొనగా, పతకాలతో తిరిగి రావడంపై స్థానికులు అభినందనలు తెలియజేశారు.

చెట్టు కూలి ముగ్గురికి గాయాలు



సంతలో పరిస్థితిపై ఆరా తీస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి కేంద్రంలో శుక్రవారం జరిగిన వారపు సంతలో ఓ భారీ చెట్టు అకస్మాత్తుగా నేలకొరిగింది. దీంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితులు దళపతిగూడ గ్రామానికి చెందిన సోంబారి దళపతి, దుంగియాపుట్‌కు చెందిన కుంజ ఛలాన్, గోవిందపల్లి గ్రామానికి చెందిన హరిచంద్ర సగరియా లను వెంటనే మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సోంబారికి కాలిలో ఎముకలు విరిగిపోగా, హరిచంద్రకు తలపై తీవ్ర గాయమైంది. ఇరువురినీ కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయక్ ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ చందన్‌కుమార్ భొయి, సమితి అధికారి హృషీకేష్ గండో, ఐఐసీ రంజన్‌కుమార్ స్వాయి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా కేంద్రంలోని తామిలి క్యాంప్ వీధిలో ఓ ఇంటిపై చెట్టు నేలకూలగా, ఒడ్రాఫ్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి, చెట్టును తొలగించారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి



విజేతలతో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మహంతి, వర్సిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీకే మహంతి అన్నారు. ఈ మేరకు మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో సెంచూరియన్ లీగ్ ఓపెన్ టోర్నమెంట్-2023 విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, యువత తమకు నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం పొందాలని పిలుపునిచ్చారు. ఏ రంగంలోనైనా గెలుపోటములు సహజమని ఓటమిని ఆహ్వానించి లక్ష్య సాధనకు కృషి చేయాలని హితవు పలికారు. రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్‌లు డాక్టర్ పల్లవి, ఆర్ఎస్ వర్మ మాట్లాడుతూ వర్సిటీలో అన్ని రకాల క్రీడలకు అనువుగా మైదానాలను సిద్ధం చేశామన్నారు. ఈ టోర్నీలో ఆయా క్రీడల్లో 30 గ్రామాలకు చెందిన జట్లు తలపడ్డాయి. క్రికెట్‌లో విన్నర్‌గా గొట్లాం జట్టు, రన్నర్‌గా రామవరం జట్టు నిలిచాయి. వాలీబాల్‌లో చీపురుపల్లి ఎంవీజీఆర్ జట్టు విన్నర్‌గా, మొయిద జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు వర్సిటీ ప్రతినిధులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్‌లు రమణారావు, ఆచార్యులు, సన్నీడియోల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్‌లో గుండెపోటుతో యువకుడి మృతి



గుండెపోటుతో మృతిచెందిన శ్రీహరి

రాజాం సిటీ: ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి ఆదుకుంటాడనుకున్న కుమారుడు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. కుమారుడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తండ్రి మరణ వార్త విని నిశ్చేష్టుడయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పొందూరు మండలం ధర్మపురం గ్రామానికి చెందిన మొదలవలస సింహాచలం భార్యా పిల్లలతో కలిసి బతుకు తెరువుకోసం రాజాం మండలం మొగిలివలస వచ్చి నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు జరిగాయి. శ్రీకాకుళం రోడ్డులో టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా ఐదేళ్ల క్రితం భార్య మృతిచెందింది. అప్పటి నుంచి కుమారుడి సహాయంతో జీవనం సాగిస్తున్నాడు. పీజీ వరకు చదువుకున్న కుమారుడు మొదలవలస శ్రీహరి (28) పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. పోటీ పరీక్షల్లో భాగంగా దేహదారుఢ్యం కోసం ఎప్పటిలాగే శుక్రవారం మొగిలివలస నుంచి బొబ్బిలి రోడ్డులోని ఫైర్‌స్టేషన్ వద్దకు వాకింగ్‌చేసుకుంటూ వచ్చాడు. అక్కడ గ్రౌండ్‌లో ఉన్నట్లుండి కుప్పకూలిపోయాడు. అది గమనించిన ఫైర్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

‘సమతా’కు తప్పిన ముప్పు

- ఇంజిన్ నుంచి విడిపోయిన బోగీలు
- ఆందోళన చెందిన ప్రయాణికులు
- ఎమర్జెన్సీ బ్రేక్ వేసి ఆపిన గార్డ్



పార్వతీపురంలో విడిపోయిన బోగీల వద్దకు వస్తున్న ఇంజిన్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గుండా వెళ్తున్న సమతా ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ నుంచి బోగీలు విడిపోయాయన్న విషయం పార్వతీపురం పట్టణమంతా వ్యాపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం టౌన్-పార్వతీపురం స్టేషన్ల మధ్యలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు చేపట్టిన మెగాబ్లాక్ పనులు పూర్తి చేసిన రైల్వే అధికారులు రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా సాయంత్రం 5 గంటల సమయంలో లైన్స్ క్లియర్ చేశారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.55 గంటల సమయంలో రావాల్సిన నిజాముద్దీన్- విశాఖపట్నం సమతా ఎక్స్‌ప్రెస్ మరికొద్ది సేపటిలో 3వ నంబర్ ఫ్లాట్‌ఫారం మీదికి రానున్నదని రాత్రి 7.20 గంటలకు పార్వతీపురం స్టేషన్‌లో అనౌన్స్ చేశారు. పది నిమిషాల్లో హారన్ కొడుతూ 7.30 గంటలకు సమతా ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ మాత్రమే 3వ నంబర్ ప్లాట్ ఫాం మీదికి వచ్చింది. విడిపోయిన బోగీలలో వెనక బోగీలో ఉన్న గార్డ్ ఈ విషయాన్ని గమనించి ఇంజిన్ లేకున్నా కదులుతున్న బోగీలను ఎమర్జెన్సీ బ్రేక్ వేసి ఆపడంతో బోగీలన్నీ పార్వతీపురం టౌన్-పార్వతీపురం స్టేషన్ల మధ్యలో ఆగిపోయాయి. ఇంజిన్ లేకుండా బోగీలన్నీ సుమారు అరకిలోమీటరు వరకు ప్రయాణించాయి. గార్డు అప్రమత్తం కావడం వల్ల పెనుముప్పు తప్పడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. మెగాబ్లాక్‌లో భాగంగా చేపట్టిన మెయింటనెన్స్ పనుల్లో ఎక్కడో ఒకచోట కపిలింగ్ ఊడిపోవడం వల్ల ఇంజిన్ నుంచి బోగీలు వేరు పడ్డాయని టెక్నీషియన్లు తెలిపారు. తర్వాత ఇంజిన్‌ను వెనక్కి తీసుకువెళ్లి టెక్నీషియన్లు కపిలింగ్ వేయడంతో రాత్రి 9 గంటల సమయంలో పార్వతీపురం స్టేషన్ నుంచి గంటన్నర ఆలస్యంగా సమతా ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం బయలుదేరింది.

బోధకాలు నివారణకు చర్యలు



వేదికపై సీడీఎం సదానంద్ ఏసీడీఎం జగదీష్, డీపీఎం శ్యామ్, అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

- 36లక్షల మందికి మందుల పంపిణీకి ఏర్పాట్లు
- గంజాం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: గంజాం జిల్లాలో పూర్తిస్థాయిలో బోధకాల నివారణపై ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేశామని కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా అన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలో 36లక్షల మందికి ఉచితంగా బోధకాల నివారణ మందు పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఆరోగ్యశాఖ సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ వ్యాధి విజృంభిస్తున్న తరుణంలో గంజాం జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఈనెల 25 నుంచి మందులు పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 16 ఎన్ఏసీలు, 22 బ్లాక్‌లు, మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 475పంచాయతీ గ్రామాల్లో ఇంటింటికీ డీఈసీ, అర్బండోజ్ మాత్రలు ఉచితంగా పంచి చేయనున్నామని ప్రకటించారు. ఇందులో 7,050మంది ఆశా కార్యకర్తలు, 705మంది సూపర్‌వైజర్లు సేవలందించనున్నారని పేర్కొన్నారు. వీరితో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ, ఎస్ఎస్‌జీ, ఎన్‌జీఓలు, ఇతర సామాజిక సేవాసంస్థల సహకారం తీసుకుంటామన్నారు. దీనిపై ఇప్పటికే శిక్షణ అందించామన్నారు. ఈ ఔషధాల వినియోగం వల్ల ఎటువంటి ఇతర ఇతర సమస్యలు ఉండవని స్పష్టం చేశారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేసి.. చైతన్య పరుస్తున్నట్లు వివరించారు. సమావేశంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి సదానంద్ మిశ్రా, ఏసీడీఎం ఆర్.జగదీశ్వర్ పట్నాయక్, డీపీఎం శ్యామ్‌సుందర్ త్రిపాఠి, టీఎంఆర్‌హెచ్ ఆశిష్‌కుమార్ మహంతి, వైద్యురాలు తృప్తిలతా మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు.

మందుల అక్రమ నిల్వ

- ముద్దాయికి మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా

విజయనగరం లీగల్: లైసెన్స్ లేకుండా ఇంట్లో వివిధ రకాల మందులు(ఔషధాలు) అక్రమంగా నిల్వ చేశాడన్న ఆరోపణ రుజువు కావడంతో గంట్యాడ మండలం నరవ గ్రామానికి చెందిన మల్లపురెడ్డి శ్రీనివాసరావుకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా అదనపు మొదటి న్యాయమూర్తి జి.రజని శుక్రవారం తీర్పుచెప్పారు. డ్రగ్స్, కాస్మోటిక్స్ చట్టం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతపల్లి అప్పారావు ఈ కేసుకు సంబంధించి అందించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ యుగంధర్ తనకు అందిన సమాచారం మేరకు మధ్యవర్తుల సమక్షంలో నిందితుడు శ్రీనివాసరావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వివిధ కంపెనీలకు చెందిన మందులతో పాటు అమ్మకాలు నిషేధించిన శాంపిల్స్ పట్టుబడ్డాయి.ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావుపై డ్రగ్స్, కాస్మోటిక్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పుచెప్పారు.

పోలీసులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీరఘట్టం: పోలీసులపై దౌర్జన్యం చేసిన వీరఘట్టానికి చెందిన మీసాల చంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎంవీ రమణ శుక్రవారం తెలిపారు. వీరఘట్టం బీసీ కాలనీలో మీసాల చంటి, అతని భార్య మధ్య తగాదా జరుగుతోందని డయల్ 100కు గురువారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఒక హోం గార్డు, కానిస్టేబుల్ ఆ ఇంటికి వెళ్లారు. పోలీసులు రావడంపై చంటి ఆగ్రహం వ్యక్తం చేసి దౌర్జన్యానికి దిగాడు. దీంతో మరో ఇద్దరు కానిస్టేబుల్స్, ఎస్సై, ఏఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లారు. వారిపైన కూడా మీసాల చంటి దురుసుగా వ్యవహరించడంతో పాటు కానిస్టేబుల్ ప్రసాద్‌పై దౌర్జన్యానికి దిగాడు. ఈ మేరకు కానిస్టేబుల్ ప్రసాద్ ఫిర్యాదు చేయగా చంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

28న మెగా జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను ఈనెల 28న నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. వర్క్‌రూట్, సీఫ్ ఆధ్వర్యంలో భాస్కర్ డిగ్రీ కళాశాలలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా జరుగుతుందని పేర్కొన్నారు. 10 కంపెనీలు ఈ జాబ్ మేళాకు హాజరు కానున్నాయని తెలిపారు. 2019వ సంవత్సరం నుంచి 2022 సంవత్సరాల మధ్యలో డిగ్రీ పాసైన విద్యార్థులు, 2023వ సంవత్సరంలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 84 దరఖాస్తులు



వినతులు వింటున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 84 దరఖాస్తులు అందాయి. వాటిలో కొన్ని వ్యక్తిగత, ఆర్థిక అంశాలకు సంబంధించినవి కాగా కొన్ని యూనియన్‌ల ద్వారా పలు అంశాలపై దరఖాస్తులు అందాయి. నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఇండ్ల స్థలాల మంజూరు కోసం, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. అదేవిధంగా పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్‌లు మంజూరు చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డులపై క్యాష్‌లెస్ వైద్యం అందేలా చూడాలని వినతులు ఇచ్చారు. ఖాళీగా ఉన్న నాల్గవ తరగతి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పలువురు ఉద్యోగులు గ్రీవెన్స్‌లో విన్నవించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. రిటైర్ అయిన వివిధ కేడర్ ఉద్యోగ, అధికారులకు సేవందించడంలో సిబ్బంది కొన్ని చోట్ల సహకారం అందించడం లేదని ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఎంఈఓ జీఎస్‌ప్రకాశరావు కోరుతూ వినతిపత్రం అందజేశారు. వినతులను జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు, ప్రభుత్వానికి పంపించి తగుచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొరటాంలో ఏనుగుల తిష్ఠ

- మామిడి తోటలో సంచారం



కొరటాం గ్రామం మీదుగా మామిడి తోటలోకి వెళ్తున్న ఏనుగులు

తెర్లాం: గడిచిన ఐదు రోజులుగా మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు శుక్రవారం ఉదయానికి కొరటాం గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో తిష్ఠ వేసింది. గురువారం ఉదయం రంగప్పవలసలో రైస్‌మిల్లును ధ్వంసం చేసి మెరకముడిదాం మండలం ఎం.గదబవలస గ్రామానికి చెందిన మామిడి తోటల వైపు వెళ్లిపోయిన ఏనుగులు అదే రోజు రాత్రి మళ్లీ రంగప్పవలస, తమ్మయ్యవలస గ్రామాల వైపు వచ్చేశాయి. తమ్మయ్యవలస నుంచి తెర్లాం గుర్రమ్మ చెరువు మీదుగా కొరటాం గ్రామం వైపు శుక్రవారం వచ్చాయి. కొరటాం ఆర్బీకే, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం పక్క నుంచి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నునగొప్పుల రాము మామిడి తోటలోకి ఏనుగుల గుంపు వెళ్లింది. గ్రామంలోకి ఏనుగులు వచ్చాయని ఎస్సై ఆర్.రమేష్‌కు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆయన సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి చేరుకుని ప్రజలు, రైతులు మామిడి తోటల్లోకి, పొలాలకు వెళ్లవద్దని మైక్ సెట్ ద్వారా ప్రచారం చేయించారు. సమాచారం మేరకు గ్రామానికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్స్ మాట్లాడుతూ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులను చూసేందుకు ఎవ్వరూ వెళ్లవద్దని, వాటిని కవ్వించవద్దని సూచించారు.

కొమరాడలో జేజేఎం కమిటీ పర్యటన

కొమరాడ: మండలంలోని కోనవలస, డంగభద్ర, కందివలస, సుందరాపురం, అంకుళ్లవలస, కోమట్లపేట, బంగారమ్మపేట తదితర గ్రామాల్లో జాతీయ జలజీవన్ మిషన్ (జేజేఎం) కమిటీ సభ్యులు సోహాల్‌లాల్ సల్వీ, రమేష్ చంద్రమిశ్రా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్యశాఖ నిర్వహించిన ఇంటింటి కుళాయి(జేజేఎం పథకం) నిర్వహణపై ఈ సందర్భంగా ఆరా తీశారు. ఆయా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి వాటర్ శ్యాంపిల్‌ను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విలేజ్ వాటర్, శానిటేషన్ కమిటీ ఏర్పాటు చేసి ప్రతి కుళాయికి కొంతమొత్తాన్ని వసూలు చేసి పథకం నిర్వహణకు ఖర్చుచేయాలని సూచించారు. అలాగే పథకంలోని లోపాలను సరిదిద్దాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. కచ్చితంగా నీటి సరఫరా ఆపరేటర్‌ను వేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరాశాఖ డీఈ నాగేశ్వరరావు, ఏఈ నవీన్‌కుమార్, వైస్ సర్పంచ్ నంగిరెడ్డి శరత్ బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



సమీక్ష పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువర్ణ, అధికారులు

శ్రీకాకుళం అర్బన్ : గ్రంథాలయాలు యువతకు మరింత చేరువకావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయాధికారులు, బీడీసీ నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. లైబ్రరీలను డిజిటలైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సువ్వారి సత్యనారాయణ, కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎం సెంటర్‌లో మోసం

టెక్కలి రూరల్: ఏటీఎం సెంటర్ వద్ద మోసం జరిగిందంటూ టెక్కలి మండలం వేములవాడ విశ్వనాథపురం గ్రామానికి చెందిన వృద్ధుడు పత్రి రాజారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న రాజారావు తన ఏటీఎం కార్డును పట్టుకుని టెక్కలి ఏటీఎం సెంటర్ వద్దకు వచ్చాడు. తనకు డబ్బులు విత్ డ్రా చేయడం రాకపోవడంతో సమీపంలో గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చాడు. రూ.రెండు వేలు డ్రా చేయాలని చెప్పడంతో ఆ వ్యక్తి రూ.2వేలు తీసి వృద్ధుడికి ఇచ్చాడు. ఆ సమయంలో వేరే ఏటీఎం కార్డును వృద్ధుడు ఇవ్వడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం సదరు గుర్తు తెలియని వ్యక్తి వేరువేరు ఏటీఎం సెంటర్‌ల నుంచి సుమారు లక్ష రూపాయలు విత్ డ్రా చేసినట్లు తెలుసుకున్న బాధిత వృద్ధుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు.ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ-2రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి టెక్కలిలో ఉన్న ఏటీఎం సెంటర్ల వద్ద అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : ఆర్థిక పరిస్థితి బాగోలేక మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. బలగ ఆదివారంపేటకు చెందిన బలగ సీతారాం (40)కు భార్య రాధ, ఇద్దరు కుమారులు. దంపతులిద్దరూ కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సీతారాంకు చిన్న చిన్న అప్పులు, మద్యం అలవాటు ఉండటంతో నిత్యం తాగుతూ ఇంటికి వచ్చేవాడు. భార్య తాగడం మానమని చెబితే.. మానాలని ఎంతో ప్రయత్నిస్తున్నా.. తన వల్ల కావడం లేదంటూ ఎప్పుడూ బాధపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లోని శ్లాబ్ హుక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

మహిళా పోలీసులే కీలకపాత్ర పోషించాలి



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి మహిళా పోలీసు గ్రామ స్థాయిలో నేర నియంత్రణలో ముఖ్య భూమిక పోషించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. మహిళా పోలీసులకు ముఖ్యంగా వారి విధి విధానాలు, సమస్యలు, ప్రజా, మహిళా భద్రత, యువత సన్మార్గంలో నడిచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా శుక్రవారం గ్రీవెన్స్‌డేలో విన్నవించుకుంటే పరిష్కరిస్తామంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో సీఐ బూర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జగన్మోహన్‌రావు



పొందూరు: మండలంలోని మజ్జిలిపేట గ్రామానికి చెందిన గురుగుబెల్లి జగన్మోహనరావు ఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించారు. ఈయన ప్రస్తుతం నాగాలాండ్ రాష్ట్రంలో కోహిమాలోని మోడరన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఎన్‌సీఈఆర్‌టీలో ఉద్యోగం సాధించడంపై తండ్రి వేణుగోపాలరావు, తల్లి ఆండాలమ్మ, భార్య శ్రావణి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు అస్వస్థత

- క్లోరోక్విన్ మాత్రలు రియాక్షన్ ఇవ్వడంతో ఘటన
- ఆందోళన అక్కర్లేదన్న వైద్యులు



అస్వస్థతకు గురైన విద్యార్థినిలకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

మందస: మలేరియా నివారణ కోసం పంపిణీ చేసిన క్లోరోక్విన్ మాత్రలు రియాక్షన్ ఇవ్వడంతో మందస మండలం బుడంబో గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం 35 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరికి సకాలంలో వైద్య సేవలు అందించడంతో పరిస్థితి సద్దుమణిగింది. గిరిజన ప్రాంతాల్లో మలేరియా ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో క్లోరోక్విన్ మాత్రలు అందించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో గల పీహెచ్‌సీల నుంచి మాత్రలను పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా బుడంబో కాలనీ పీహెచ్‌సీకి చెందిన ముగ్గురు సిబ్బంది ఆశ్రమ పాఠశాలకు చేరుకుని, ఉదయం 10.30 గంటల సమయంలో మాత్రలు పంపిణీ చేశారు. ఈ మాత్రలను టిఫిన్, భోజనం చేసిన అనంతరం వేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అయితే ఉదయం 7.30 నుంచి 8 గంటల మధ్య గిరిజన విద్యార్థినులు టిఫిన్ చేశారు. టిఫిన్ తర్వాత పిల్లలు మాత్రలు వేసుకోవడంతో అది రియాక్షన్ ఇచ్చింది. 6వ తరగతి నుంచి 8వ తరగతి చదువుతున్న సుమారు 65 మంది విద్యార్థినులకు మాత్రమే టాబ్లెట్స్ అందజేశారు. వీరిలో ముందుగా 8వ తరగతి చదువుతున్న కె.సుస్మితకు అసౌకర్యం అనిపించింది. కొద్దిసేపటికే ఒక్కొక్కరూ అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే దగ్గరలో ఉన్న బుడంబో కాలనీ పీహెచ్‌సీకి విద్యార్థులను తీసుకెళ్లారు. వీరిలో కొందరి పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో ఆస్పత్రిలోని ప్రత్యేక గదులతో పాటు సమీపంలోని తోటలో ఉంచి కూడా డాక్టర్ రవికుమార్ దొర, సిబ్బంది వైద్యమందించారు. విషయం తెలిసి విద్యార్థినుల తల్లిదండ్రులు అక్కడకు పాఠశాలకు చేరుకున్నారు. 8వ తరగతి చదువుతున్న జ్యోత్స్న పరిస్థితి ఆందోళనగా ఉండడంతో పలాస తీసుకెళ్లారు. బుడంబో పీహెచ్‌సీ సెకెండ్ మెడికల్ అధికారి డాక్టర్ పూర్ణరవిచంద్ర విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. యాంటీడోస్ ఇచ్చామని, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. హెచ్‌ఎం కె.తిరుపతిరావు మీటింగ్‌కు సీతంపేట వెళ్లారని ఉపాధ్యాయులు చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, సర్పంచ్ సవర సంధ్య, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సవర రాము, మద్దిల రామారావు, సవర బాలకృష్ణ, మార్పు కృష్ణమూర్తి, హుటాహుటిన చేరుకుని విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. పలాసలో విద్యార్థినిని పరామర్శించారు. అలాగే ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి కూడా ఘటనపై ఆరా తీశారు. డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి కూడా పాఠశాలకు వచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ క్లోరోక్విన్ మాత్రలకు సైడ్ ఎఫెక్ట్‌లు ఉంటాయని, టిఫిన్ అనంతరం కాస్త సమయం దాటాక టాబ్లెట్స్ వేసుకోవడంతో ఇబ్బంది వచ్చి ఉంటుందని తెలిపారు. బుడంబో కాలనీ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను డిశ్చార్జి చేశామని, పలాసలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితి మెరుగుపడడంతో ఆశ్రమానికి తీసుకువచ్చామని, డాక్టర్ రవికుమార్‌దొర, డాక్టర్ పూర్ణరవిచంద్రలతో సిబ్బందిని రాత్రంతా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ చేయడానికి నియమించామని చెప్పారు.



చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

‘అభివృద్ధిని అడ్డుకునేందుకే ఫేక్ ఫిర్యాదులు’



మండవిల్లి రవి

అరసవల్లి: అరసవల్లి ఆలయంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఏదోవిధంగా అడ్డుకునేందుకు కొందరు పనిగట్టుకుని ఫేక్ ఫిర్యాదుల లేఖలు రాస్తున్నారని..ఇది మంచి పద్ధతి కాదని పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు పర్యాయాలుగా ఆలయ పాలక మండలి సభ్యునిగా కొనసాగుతున్నానని, తానే స్వయంగా ఎందరో భక్తదాతలను ఆలయానికి రప్పించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు విరాళాలు ఇప్పించానని.. వారి పర్యవేక్షణలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని.. ఇందులో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ఫిర్యాదులు చేస్తున్న వ్యక్తులు ధైర్యముంటే ఆధారాలతో ఆలయ పాలకమండలిని సంప్రదించాలని సవాల్ విసిరారు. ఊరూ పేరూ లేకుండా ఫిర్యాదులు చేయడంతో ఏం సాధిస్తారని ప్రశ్నించారు. ఆలయంలో అధికారిక సమాచారాన్ని కొందరు ఉద్యోగ సిబ్బందే బయట వారికి చేరవేస్తున్నట్లుగా ‘సాక్షి’లో శుక్రవారం ప్రచురించిన ‘ఆదిత్యాలయంలో ఇంటి దొంగలు’ అన్న కథనంపై స్పందిస్తూ.. ఇలాంటి అధికార సిబ్బందిపై విచారణ చేయాల్సిందేనని, ఈ అంశంపై ఈ నెల 25న జరుగనున్న పాలకమండలి సమావేశంలో సభ్యులంతా చర్చిస్తామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి ధ్యేయంగా తామంతా కృషి చేస్తున్నామని, మరికొద్ది రోజుల్లోనే ఆలయ ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులకు మంత్రి ధర్మాన శంకుస్థాపన చేయనున్నారని, త్వరలో వసతిగదుల కాంప్లెక్స్ నిర్మాణం, అధునాతన కిచెన్ ఏర్పాటు తదితర పనులన్నీ చేపడుతున్నామని ప్రకటించారు.

గోదాముల్లో విజిలెన్స్ తనిఖీలు

నరసన్నపేట: నరసన్నపేటలోని ఎస్‌పీఎల్ రైస్‌మిల్లు, అనుబంధ గోదాముతో పాటు మరో నాలుగు గోదాముల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో సీఎంఆర్ రైస్ నిల్వ, రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో నరసన్నపేట సివిల్ సప్లయ్ డీటీ డబ్బీరు రామకృష్ణ, విజిలెన్స్ హెచ్‌సీ రామ్మోహనరావు పాల్గొన్నారు.

నాగభూషణరావు మృతి తీరని లోటు



నాగభూషణరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం : పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త రెడ్డి నాగభూషణరావు మృతితో నియోజవకర్గంలో మంచి నాయకుడిని కోల్పోయామని పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు అన్నారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నాగభూషణరావు తృతీయ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొర సావిత్రి, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, మండల సచివాలయ కన్వీనర్ సూర్యం, ఎస్ఎంపీపీ ప్రదీప్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు అప్పన్న, ఆలయ చైర్మన్ ఎస్.ఈశ్వరరావు, కర్రి లక్ష్మీనారాయణ, పనుకు మోహన్, అమర ఉషా, రాము, చిన్నారావు, జోగారావు, నేతాజీ, ధనుంజయ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ‘స్పందన’

- కలెక్టర్‌కు 50 వినతులు



వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మొదటిసారిగా ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా మూడో శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వ్యక్తిగతంగా కాకుండా ఉద్యోగులు సంఘాల వారీగా ఆయా శాఖలకు సంబంధించి 50 సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

- జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం తరఫున రాష్ట్ర నాయకులు పి.వేణుగోపాలరావు, జిల్లా శాఖ అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.ఎస్.రాజు, జి.ఎల్.శ్రీను, పి.శ్రీను, సోనీకిరణ్ తదితరులు కలెక్టరుని కలిశారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు నిర్వహించాలని కోరారు. ఖాళీగా ఉన్న తహసీల్దారు పోస్టులను అప్రూవల్ ప్యానెల్ సీనియర్ ఉప తహసీల్దార్లకు మాత్రమే ఎఫ్ఏసీ కల్పించాలని విన్నవించారు. వివిధ కేడర్ల ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఉద్యోగుల డిసిప్లినరి కేసులు పరిష్కరించాలన్నారు. గ్రేడ్-1 వీఆర్‌ఓ పోస్టుల ప్రొబేషన్ రెగులర్ చేయాలని, గ్రేడ్- 2 వీఆర్‌ఓలకు పదోన్నతులు కల్పించాలని కోరారు.
- ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమ నాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, రాయి వేణు, పూర్ణచంద్రరావు కలెక్టర్‌ను కలిశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఆర్థిక అంశాలతో పనిలేని, కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారుల పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు.
- జేఎల్ఎం గ్రేడ్ -2లను సచివాలయం ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రొవిజన్ డిక్లేర్ చేసి, ట్రెజరీల ద్వారా జీతాలు చెల్లించాలని, విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, సర్వీస్ రిజిస్టర్ అందించాలని జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులు, సచివాయ ఎనర్జీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు పి.రమణ, సురేష్, గోవింద్, అప్పారావు, కృష్ణారావు తదితరులు కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పి.మురళీకృష్ణ, జెడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



సివిల్స్ విజేత కళ్యాణిని సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ లక్ష్యంతో పనిచేస్తే తప్పక విజయం సిద్ధిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. డాక్టర్ దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం పాతబస్టాండ్ సమీపంలో సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో నెంబర్ వన్ స్థానంలో ఉంటుందన్నారు. డాక్టర్ శ్రీధర్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ వైద్య రంగంలో ఉన్నత స్థాయికి చేరిన శ్రీధర్ సేవా రంగంలోనూ అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తాను కష్టపడి చదివి వైద్య నిపుణుడిగా రెండు దశాబ్దాలకు పైగా ప్రజల్లో గుర్తింపు పొందానన్నారు. ట్రస్టును విజయవంతంగా నిర్వహించేందుకు కన్వీనర్ బాధ్యతను డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుంట తులసీరావుకు అప్పగిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా నుంచి ఐఏఎస్‌కు ఎంపికైన చల్ల కళ్యాణి, జాతీయ స్థాయి నీట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన పొట్నూరు అశీష్‌లను సత్కరించారు. సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ కోసం రూ.20 లక్షల చెక్కును డాక్టర్ శ్రీధర్ అతిథుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ విద్యార్థులను ఉత్తేజపరిచేలా ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, డాక్టర్ దానేటి రాధ, దానేటి మహతి, డాక్టర్ పొట్నూరు సూర్యం, రిటైర్డ్ డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, విద్యావేత్తలు డాక్టర్ జామి భీమశంకర్, దుప్పల వెంకటరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, అంధవరపు ప్రసాద్, సంతోష్, సువ్వారి గాంధీ, సిరిపురం తేజేశ్వరరావు, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణు, ఈఈ పాగిరి సుగుణాకర్, బుడుమూరు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిపై యుద్ధం | జలాస్త్రం సిద్ధం

వంశధార అమృత ధారలా మారి ఉద్దానం గొంతు తడపనుంది. దశాబ్దాలుగా ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ మహమ్మారిపై యుద్ధానికి ఈ జలాస్త్రాన్ని సర్కారు సంధించనుంది. దీనికి తోడుగా కిడ్నీ ఆస్పత్రి పనులు కూడా జోరుగా జరుగుతుండడం ఈ ప్రాంతానికి శుభ సూచిక. వందల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు దాదాపు పూర్తయ్యింది. తాజాగా అధికారులు ప్రాథమికంగా ట్రయల్ రన్ వేశారు. మరోసారి ట్రయల్ రన్ వేసి జనాలకు జలాలు పంచడమే ఇక తరువాయి. ఆ రోజు కూడా ఎంతో దూరంలో లేదు.

- సిద్ధమైన ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు
- ప్రాథమిక ట్రయల్ రన్ వేసిన అధికారులు
- హిరమండలం రిజర్వాయర్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు నీరు విడుదల
- మట్టి, లీకులు తదితర లోపాలను గుర్తించేలా ప్రాథమిక ట్రయల్ రన్
- త్వరలోనే అధికారిక ట్రయల్ రన్
- ఆ తర్వాత సీఎం చేతులమీదుగా ప్రారంభోత్సవం



హిరమండలం రిజర్వాయర్ వద్ద నిర్మించిన ఇంటేక్ వెల్ వంతెన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉద్దానం ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దశాబ్దాలుగా కిడ్నీ మహమ్మారి బారిన పడి నిర్జీవంగా మారిన ఈ ప్రాంతం గొంతులో అమృతం పోసేలా ప్రభుత్వ భారీ మంచినీటి పథకాన్ని నిర్మించింది. ఈ ఉద్దానం ప్రాజెక్టు పనితీరు తెలుసుకునే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఇందులో భాగంగా హిరమండలం రిజర్వాయర్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వంశధార జలాలను గురువారం రాత్రి వదిలారు. శుద్ధి చేసిన జలాలను పైపులైన్ల ద్వారా ట్యాంకులకు ఒత్తిడితో పంపించారు. ఎక్కడైనా పైపులైనులో మట్టి కూరుకుపోయినా, లీకేజీ తదితర లోపాలు ఉన్నా గుర్తించేందుకు వీలుగా ప్రాథమిక ట్రయల్ రన్ నిర్వహించారు. ఇప్పటివరకైతే అంతా విజయవంతంగానే సాగింది. అంతా సవ్యంగా ఉందని నిర్ధారించాక అధికారిక ట్రయల్ రన్ నిర్వహించి, ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించనున్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధికి చరమగీతం పాడాలన్న ఉద్దేశంతో అక్కడి ప్రజలకు భూ ఉపరితలం నుంచి శుద్ధి చేసిన వంశధార జలాలను అక్కడికి పంపించేందుకు రూ.700 కోట్లతో భారీ మంచినీటి పథకాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చాక జిల్లాలో చేపట్టిన తొలి బృహత్తర కార్యక్రమంగా ఉద్దానం మంచినీటి ప్రాజెక్టుకు ప్రాధాన్యమిచ్చారు. మధ్యలో కోవిడ్ వల్ల పనుల్లో జాప్యం జరిగింది. ఆ తర్వాత జోరు పెరిగింది. పనులు ప్రస్తుతం దాదాపు పూర్తయ్యాయి.

ప్రాజెక్టు ఉద్దేశమిది..

ఉద్దానం ప్రాంతంలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఏడు మండలాలతో పాటు పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి ప్రజలకు శుద్ధి జలం అందించేందుకు పనులు చేపట్టింది.
2051కు ఉండే జనాభాను అంచనా వేసి, ప్రతి వ్యక్తికి 100 లీటర్ల నీటిని అందించేందుకు ప్రాజెక్టు రూపకల్పన జరిగింది.

- ప్రస్తుతం ఏడు మండలాల పరిధిలోని 809 గ్రామాల్లో 5లక్షల వరకు జనాభా ఉన్నారు.
- 2051నాటికి 7.8లక్షలకు పెరగొచ్చనే అంచనాతో రోజుకి 840 లక్షల లీటర్ల శుద్ధి జలాన్ని అందించేలా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.
- హిరమండలం రిజర్వాయర్ నుంచి సంవత్సరానికి 1.12 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు.



శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసే ట్యాంకు



ప్రాజెక్టు పైపులైన్

ప్రాజెక్టు స్వరూపం

- హిరమండలం రిజర్వాయర్ నుంచి ఇచ్ఛాపురం వరకు తాగునీటిని తరలించేందుకు 1047 కిలోమీటర్ల పొడవునా భూగర్భ పైపు లైన్ వేశారు.
- ఎంఎస్(మైల్డ్ స్టీల్) పైపు లైన్ 50 కిలోమీటర్ల మేర, డీఐ పైపు లైన్ 150 కిలోమీటర్ల మేర, హెడ్‌డీపీఈ(హై డెన్సిటీ పాలీ ఎథిలిన్)పైపులైన్ 850 కిలోమీటర్ల మేర వేశారు.
- 530 మీటర్ల మేర హిరమండలం రిజర్వాయర్ వద్ద అప్రోచ్ వంతెన నిర్మించారు.
- హిరమండలం రిజర్వాయర్ వద్ద 33 మీటర్ల లోతు నుంచి 148 మీటర్ల ఎత్తు వరకు వాటర్ పంపింగ్ చేస్తారు.
- పంపింగ్ కోసం 1300 హెచ్‌పీ గల మూడు పంపు సెట్‌లను ఏర్పాటు చేశారు. అందులో రెండు వర్కింగ్‌లో, ఒకటి స్టాండ్‌బైగా ఉంటుంది. దాని కోసం ఇంటాక్ వెల్ పంప్ హౌస్ నిర్మించారు.
- ప్రతి రోజూ 22 గంటలు పంపింగ్ చేసే సామర్థ్యంతో రెండు భారీ మోటార్లు ఒక్కో నిమిషానికి 28 వేల లీటర్లకు పైగా నీటిని పంపింగ్ చేయనున్నాయి. విద్యుత్ సరఫరా చేసేందుకు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు.
- ఎగుడు, దిగుడు కొండలు, మైదాన ప్రాంతాలు దాటుకుని 32 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెళియాపుట్టి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(శుద్ధి కేంద్రం)కు నీరు చేరేలా పనులు చేపట్టారు.
- కొరసవాడ వద్ద 2000 కిలో లీటర్ల ట్యాంకర్, మెళియాపుట్టి వద్ద 84ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటి శుద్ధి ట్యాంకుల నిర్మాణం చేపట్టారు.
- అక్కడ ఏర్పాటు చేసిన శుద్ధి కేంద్రంలోకి పంపించి నీటిని శుభ్ర పరుస్తారు. నీటిని శుద్ధి చేయడానికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఫిల్టర్ బెడ్‌ల కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.
- నీటి తరలింపు మార్గంలో వంశధార నది ఉండటంతో నదీ గర్భంలో దాదాపు అరకిలోమీటర్ మేర పైపు లైన్ నిర్మాణం చేపట్టారు. కొన్నిచోట్ల కొండలను తొలిచి 79 మీటర్ల ఎత్తుకు...ఆపై 50 మీటర్ల దిగువకు... మళ్లీ 147మీటర్ల ఎత్తున ఉండే కొండపైకి, మళ్లీ దిగువకు పైపు లైన్ నిర్మించారు.
- 700 మీటర్ల నది క్రాసింగ్ పనులు చేపట్టారు.
- రెండు నియోజకవర్గాల్లో 571 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు.
- మెళియాపుట్టి వద్ద 9000 కిలో లీటర్ల వాటర్ సంప్, పలాస, ఇచ్ఛాపురంలో 1000 కిలో లీటర్ల వాటర్ సంప్‌లు నిర్మించారు. మెళియాపుట్టి శుద్ధి కేంద్రం వద్ద మరో సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు.

తాజాగా ప్రాథమిక ట్రయల్ రన్.



ప్రాథమిక ట్రయల్ రన్‌లో భాగంగా నీరు వదిలిన దృశ్యం

- హిరమండలం రిజర్వాయర్ వద్ద 1300 హెచ్‌పీతో ఏర్పాటుచేసిన మూడు మోటార్లతో గురువారం రాత్రి ప్రాథమిక ట్రయల్ రన్ నిర్వహించారు.
- హిరమండలం రిజర్వాయర్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తొలుత నీరు వదిలారు.
- సుమారు తొమ్మిది గంటల పాటు ఇంటక్ వెల్ నుంచి వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌లోకి 850 లక్షల లీటర్ల నీటిని ఎత్తిపోశారు.
- అక్కడ శుద్ధి చేసిన నీటిని ప్రెజర్(ఒత్తిడి)తో పైపులైన్ల ద్వారా ట్యాంకులకు పంపించే కార్యక్రమం చేపట్టారు.
- ఎక్కడైనా పైపు లైన్‌లో మట్టి పేరుకుపోతే ఒత్తిడితో కూడిన నీటి ద్వారా క్లీన్ కానున్నాయి.
- రిజర్వాయర్ వద్ద నీటి మళ్లింపు, మోటార్ల ద్వారా ఎత్తిపోతలు విజయవంతమయ్యాయి.
- లోపాలు అధ్యయనం చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.